# గోడమీది మూడోవాడు

ఖాసింఖాను, శీతారామయ్యా బాల్య స్నేహితులు. వాళ్ళ యిల్లు ఒక దాని ప్రక్కన ఒకటియున్నా, ఆ యిళ్ళమధ్య గోడ వుంది. రాకపోకలు వీలుగా వుంటుందనే ఉద్దేశంతో ఆ గోడ బద్దలుగొట్టించి, దారి పెట్టించుకున్నారు. ఈ పని వాళ్ళ భార్యల వొత్తిడివల్ల జరిగింది.

పనిపాటలు త్వరగా పూర్తిచేసుకొని, వాళ్ళిద్దరి భార్యలూ ఆ దారిలో కూర్చొని, కబుర్లు చెప్పుకుంటూ వుండేవారు. వాళ్ళిద్దరికీ చాలా స్నేహం. ఒకరి కష్టసుఖాలు ఒకరు చెప్పుకుంటూ, రెండోవారివల్ల ఉపశాంతి పొందుతూ వుండేవాళ్ళు. కూరలు వండటం, పిండివంటలు చెయ్యటం దగ్గర్నుంచీ ఒకరి సలహా ఒకరు తీసుకుంటూ వుండేవారు.

ఖాసింఖానుకి ఒక కొడుకూ, శీతారామయ్యకి ఒక కూతురువుంది. వాళ్ళిద్దరూ ఎప్పుడూ ఆ దారిలో కూర్చొని ఆడుకుంటూ వుండేవారు.

ఖాసింఖాను భార్యకి శీతారామయ్యా కూతురంటే చాలా ముద్దు. ఎప్పుడూ తన యింట్లోనే ఉంచుకొనేది. ఆ పిల్ల ఒక్కక్షణం కనిపించక పోతే, "నాకోడలేదీ" అంటూ వెతుక్కుంటూ శీతరామయ్య యింటికి వొచ్చేది.

"నీ అత్త వొచ్చిందే!" అని పిలిచేది కూతుర్ని, శీతారామయ్య భార్య.

ఆ పిల్ల ఎక్కడున్నా, అత్తపేరు వినేటప్పటికి, విప్పారిన మొహంతో రెక్కలు కట్టుకొచ్చి వాలేది. ఆ పిల్లకి ఖాసింఖాన్ యింట్లో వుండే రొట్టెలూ, కేకులూ అంటే యిష్టం. ఖాసింఖాన్ కొడుక్కి శీతారామయ్య ఇంట్లో దొరికే మీగడ పెరుగంటే యిష్టం. ఒక్క పిల్లలకేకాదు. పెద్ద

వాళ్ళకుకూడా అంతే. అందుకని మధ్యదారిగుండా వీళ్ళరొట్టెలూ, కేకులూ వాళ్ళయింటికీ, వాళ్ళ మీగడపెరుగు వీళ్ళ యింటికీ ఎప్పుడూ రవాణా అవుతుండేవి. ఈ రెండు కుటుంబాలూ యింత అన్యోన్యంగా వుండటంవల్ల, ఒకరు మహమ్మదీయులూ, ఒకరు హిందువులూ అయినా ఆచారవ్యవహారాల్లో చాలా సామ్యత ఏర్పడింది. ఒకరి సాంప్రదాయాలు ఒకరు సానుభూతితో చూట్టం అలవడింది.

కాని రోజులు ఎప్పుడూ ఒకవిధంగా గడవ్వు. భారతదేశంలో, ఇతరత్రా జరుగుతున్న మత కలహాలు నెమ్మదిగా ఆ గ్రామానిక్కూడా ప్రాకినై. అంతకుముందు సోదరులకు మల్లే కలిసి మెలిసి వుంటున్న హిందువులూ, మహమ్మదీయులూ, వొకరి నొకరు అనుమానించుకోవటం, అసహ్యించుకోవటం మొదలుపెట్టారు. ప్రజలు భయోత్పాతులై, మతి భ్రమించినట్లు ప్రవర్తిస్తున్నారు.

మొదట్లో ఖాసింఖానూ, శీతారామయ్యా, మతకలహం తమ గ్రామం ప్రవేశించకుండా చెయ్యటానికి ప్రయత్నించారు గాని, వాళ్ళవల్ల అవలేదు. కన్నుమూసి కన్ను తెరిచేటప్పటికి మానవ స్వభావం వాళ్ళ వాళ్ళయుండే విచిత్రంగా మారిపోయింది. మానవుల్లో పశులక్షణాలు అగ్రస్థానం వహించినై. అంతకిముందు తమ మాటను ఆజ్ఞగా శిరసావహించే వాళ్ళు ఇప్పుడు [illegible] ప్రాయంగా తోసివేస్తున్నారు. చెల్లాచెదురుగా హత్యలు జరుగుతున్నై. పొలంలో పనిచేసుకుంటున్న వొక హిందువుని మహమ్మదీయులు పొడిచారు. కూలికి వెడుతున్న వొక బీద మహమ్మదీయుని హిందువులు నరికారు. ఈ హత్యలతో ఊరంతా అట్టు వుడికినట్లు ఉడికిపోయింది. ప్రాణమానాలకు రక్షణ అనేది లేకుండా పోయింది. ఈ సాకు తీసుకుని "శాంతి నెలకొల్పడం" అనే మిషతో, ఇంగ్లీషువాడు సైన్యసమేతంగా వొచ్చి, ఆ గ్రామంలో తిష్ఠ వేశాడు. తమలోతాము కలహించుకోవటం వల్ల, మూడోవాడొకడు ఆ గ్రామంలో అడుగుపెట్టడానికి వీలయింది.

వొచ్చీ రాగానే ఇంగ్లీషువాడు, గ్రామంలోవున్న హిందువుల్నీ మహమ్మదీయుల్నీ పిలిపించి మాట్లాడాడు. మహమ్మదీయుల్తో ఏం మాట్లాడాడో హిందువులకు తెలియదు. హిందువులతో ఏం మాట్లాడాడో మహమ్మదీయులకు తెలియదు. కాని అతను మాట్లాడిన తర్వాత హిందువులూ, మహమ్మదీయులూ కూడా ఎవరికివారు, "ఇంగ్లీషువాడు మనవక్కే" అనే ధీమాతో విజృంభించారు.

ఈ విజృంభణ అప్పటివరకూ హిందూ, మహమ్మదీయ సఖ్యతకోసం ప్రయత్నిస్తున్న ఖాసింఖాన్నీ, శీతారామయ్యనీ కూడా విడదీసింది. మహమ్మదీయులు విజృంభించడానికి ఖాసింఖాన్ సహాయం వుందని శీతారామయ్యా హిందువులు విజృంభించడానికి శీతారామయ్య దోహదం లేకపోలేదని ఖాసింఖానూ ఊంహించుకొని మనస్పర్థలు పెంచుకొన్నారు.

ఇంగ్లీషువాడు ఇది కనిపెట్టి ఖాసింఖాన్నీ, సీతారామయ్యని వేరు వేరుగా పిలిపించి మాట్లాడాడు. సీతారామయ్యతో "ఖాసింఖాన్ని నీవు నమ్ముతున్నావు. అతను నీకు ద్రోహం చెయ్యాలని చూస్తున్నాడు. ఊరు మాటుమణిగిం తర్వాత మీ ఇంటిమీదకు వొచ్చి పడదాం అని చూస్తున్నాడు-జాగ్రత్త" అని శీతారామయ్యని హెచ్చరించాడు.

ఈమాట వినేటప్పటికి శీతారామయ్యకు చాలాకోసం వొచ్చింది. హృదయం ఉడికిపోయింది. ఖాసింఖాన్ చర్యలు ఇటీవల అనుమానాస్పదంగా వున్నా-తనకే ద్రోహం చెయ్యటానికి పూనుకుంటాడని అతడెప్పుడూ అనుకోలేదు. నిజంగా మహమ్మదీయుల్ని నమ్మగూడదు అనుకున్నాడు. తగుమాత్రం జాగ్రత్తలో వుండాలని నిశ్చయించుకున్నాడు. ఇంటికి వెళ్ళీ, వెళ్ళటంతోనే తాపీవాళ్ళని పిలిపించి ఖాసింఖాన్ ఇంటికీ తన ఇంటికీ మధ్య వున్న దారి పూడ్పించివేశాడు. ఈ సంగతి ఇంగ్లీషువాడు తెలుసుకొని ఖాసింఖాన్ని పిలిపించి. "నువ్వు వొట్టి అమాయకుడివి. కాకపోతే శీతారామయ్యతో నీకు ఎట్లా పొత్తు కుదురుతుంది? నీ వాసనే తగలకూడదని, మీ ఇళ్ళమధ్య గోడ కట్టించాడటగా" అన్నాడు.

ఈమాటకు ఖాసింఖాన్ ఉగ్రుడై పోయాడు. తను ఎంతో సోదర భావంతో ఉంటున్నాడే, దానికి ప్రతిఫలం ఇదా! ఈ హిందువులను నమ్మ కూడదు. తన జాగ్రత్తలో తానుండాలి అనుకున్నాడు. ఇంటికివెళ్ళి వెళ్ళటం తోనే, తాపీ పనివాళ్ళను పిలిపించి శీతారామయ్య కట్టించిన గోడకు సిమెంటు పూత వేయించాడు.

అప్పటినుంచీ ఈ ఇంటిలో కేకులు ఆ ఇంటిలోకి, ఆ యింటిలో మీగడ ఈ యింటిలోకి వెళ్ళటంలేదు. వాళ్ళ కేకులు వాళ్లే తినేవారు. వీళ్ళ మీగడపెరుగు వీళ్లే తినేవారు. "ప్రాణానికి హాయిగావుంది. ఏ చీకూ చింతా లేకుండా ఎవరి బ్రతుకు వాళ్లమే బ్రతుకుతున్నాం" అనుకున్నారు ఇద్దరూ. కాని కొన్ని రోజులు గడిచేటప్పటికి ఈ బ్రతుకు దుర్భరం అనిపించింది. ఇద్దరి భార్యలూ ఏపనిచెయ్యకుండా ఏదో పోగొట్టుకున్న వాళ్ళకుమల్లే అస్తమానం దిగులుగా కూర్చునేవాళ్ళు పిల్లలకు ఒకచోట కాలు నిలిచేది కాదు దేనికోసమో వెతుక్కుంటున్నట్లు ఇల్లంతా తిరుగుతుండేవాళ్ళు బిక్క మొహాలు పెట్టుకుని.

వీటన్నిటికంటె మరొక్కటి పెద్ద బాధ అయిపోయింది. అవతల ఏం జరుగుతూవుందో ఇవతలవాళ్ళకు తెలియదు! ఇవతల ఏం జరుగుతూ వుందీ, అవతలవాళ్ళకి తెలియదు. అవతల వాళ్ళు తనమీద ఏదో కుట్రలు పన్నుతూవుంటారని ఎవరికి వాళ్ళు అనుమానపడటం మొదలు పెట్టారు. ఏక్షణంలో వొచ్చి అవతల వాళ్ళు మీదపడతారో అని ఎవ్వరికి వాళ్ళు కళ్ళల్లో వొత్తులు పెట్టుకొని కావలా కూర్చునేవారు. ఈ అనుమానం కలిగినప్పటినుంచీ ఖాసింఖాన్‌కిగానీ, శీతారామయ్యకుగానీ సరిగానిద్రలేదు. తిండిలేదు. మనస్సుకి శాంతిలేదు.

ఈ బాధ భరించలేక ఒకరికి తెలియకుండా ఒకరువెళ్ళి ఇంగ్లీషు వాడి సహాయం కోరారు.

"ఖాసింఖాన్ సంగతి తమకు తెలుసు తమరి సహాయం లేకపోతే మేం బ్రతకలేం అన్నాడు" శీతారామయ్య.

"నేను ఉండగా నీకేం పరవాలేదు" అన్నాడు ఇంగ్లీషువాడు.

శీతారామయ్య వెళ్ళిపోగానే ఖాసింఖాన్ వచ్చాడు.

"శీతారామయ్య సంగతి మీకు తెలుసు.

ఈ సందర్భంలో మీరక్షణ అవసరం" అన్నాడు ఖాసింఖాను.

"నా కన్నీ తెలుసు, నేను వుండగా, నీకేమీ పరవాలేదు" అన్నాడు ఇంగ్లీషువాడు.

తెల్లవారేటప్పటికి తుపాకీ భుజానపెట్టుకొని శీతారామయ్య ఖాసింఖాన్‌ల ఇళ్ళమధ్య వున్న గోడమీద నిలబడి కాపలా కాస్తున్నాడు ఇంగ్లీషువాడు.

ఆ ఇంగ్లీషువాణ్ణి చూచి, "ఖాసింఖాన్ రోగం కుదిర్చాను" అనుకున్నాడు శీతారామయ్య "శీతారామయ్య రోగం కుదిర్చాను" అనుకున్నాడు ఖాసింఖాన్. ఎవరికివాళ్ళు ఇంగ్లీషువాడు తన రక్షణార్ధమే వొచ్చాడను కున్నారు సంతోషించారు.

ఇంగ్లీషువాడు అస్తమానం ఆ గోడమీదే తుపాకి భుజాన పెట్టుకొని నుంచొని కాపలా కాస్తుండేవాడు. ఒకప్పుడు తుపాకి ఖాసింఖాన్ ఇంటి వైపు గురిపెట్టేవాడు — అప్పుడు శీతారామయ్య సంతోషించేవాడు. ఒకప్పుడు శీతారామయ్య ఇంటిమీదకు తుపాకీ గురిపెట్టేవాడు అప్పుడు ఖాసింఖాన్ సంతోషించేవాడు.

తన కర్తవ్యం ఈ విధంగా నిర్వర్తిస్తూ ఒక రోజు అతడు, "నేను ఇరవైనాలుగు గంటలూ మీ పనిలోనే చేరి వుంటున్నాను. నాకు ఎండ తగలకుండా నా నెత్తిమీద గొడుగు కట్టించవలసిన బాధ్యత మీమీద వుంది" అని చెప్పాడు. ఈ కోర్కె ఖాసింఖానుకీ, శీతారామయ్యకీ

న్యాయంగానే తోచింది. నేను పట్టిస్తానంటే నేను కట్టిస్తానని పోటీపడి క్షణంమీద ఇంగ్లీషువాడికి ఎండ తగలకుండా గొడుగు కట్టించారు.

"నేను మీపనిలోవుంటున్నానుగనక నాకు భోజనసదుపాయాలుమీరే చెయ్యాలి" అన్నాడు గోడమీద ఇంగ్లీషువాడు. ఈకోర్కె కూడా వాళ్ళకి న్యాయంగానే కనిపించింది. ఆ రోజు మొదలు ఖాసింఖాను ఇంటిలోవున్న కేకులూ, శీతారామయ్య ఇంటిలోవున్న మీగడ పెరుగూ గోడమీదవున్న ఇంగ్లీషువాడే తినేసేవాడు.

అంతటితో తృప్తిపడితే అదొకరకంగా వుండేదేమో కాని ఇంగ్లీషువాడికి తృప్తి అనేది లేదు. వాళ్ళ కుటుంబ వ్యవహారాల్లోకూడా జోక్యం కలుగజేసుకోవటం మొదలు పెట్టాడు. "మీ భార్యలు వెనకపక్కనే వుండాలి." "నాకు గాలి రావటానికి ఈ గోడలు పడగొట్టాలి" "మీరు దొడ్డిదారినే నడవాలి" "మీరు నాకు యిష్టమైనకూరలే తినాలి" "నాకు ఇష్టమైన దుస్తులే ధరించాలి."

ఇవన్నీ ధరించారు ఖాసింఖాను, శీతారామయ్య. అతను తమకు రక్షణ యిస్తున్నాడు. అహోరాత్రులు తమ కోసం కష్టపడుతున్నాడు. ఏవో కొన్ని ఇబ్బందులు సహించకపోతే ఎట్లా? అనుకున్నారు.

కాని ఒక విషయంమాత్రం వాళ్ళు భరించలేకపోయారు. గోడమీద వున్న ఇంగ్లీషువాడి మెప్పు పొందాలని, మంచి మంచి భోజనపదార్థాలన్నీ అతనికి పెడుతున్నారు. కేకులూ, మీగడ పెరుగూ అతనికే పెడుతున్నారు. పిల్లలు ఆశాపాత్రంగా చూస్తూవున్నా వాళ్ళని కూడా లెక్కచేయకుండా తాము అర్ధాకలితో వుంటూ అంతా ఇంగ్లీషువాడికి ముట్ట జెబుతున్నారు. అతను కేకుముక్క పెట్టీ, మీగడ రుచి చూపించీ మాయచేసి తమ పిల్లలను తమకు కాకుండా చెయ్యటానికి ప్రయత్నిస్తున్నాడు.

పిల్లలను దగ్గరకు తీసి యిలా చెప్పేవాడు.

"మీ తండ్రులు అసమర్థులు"

"మీకు చిరుతిండి పెట్టరు"

"మమ్మల్ని నమ్ముకుంటే...."

ఖాసింఖాను ఎన్నయినా ఓర్చాడుగాని తన పిల్లవాని మనస్సులోకి విషం ఎక్కుతుంటే చూచి ఓర్వలేకపోయాడు. ఈ బ్రతుకు బ్రతికిం దాని కంటే మరణించటమే మేలు అనుకున్నాడు. తను ఏమైనా ఇబ్బందిలేదు. కాని తన కొడుకు పాడవటం మాత్రం సహించగూడదు అనుకున్నాడు. ఈ ఇంగ్లీషు వాడిచ్చే రక్షణకంటే మరణమే మేలు.

ఆ రాత్రి అందరినీ పడుకోనిచ్చి, తాను లేచాడు. గడ్డపలుగు తీసుకొని గోడదగ్గరకు వెళ్ళాడు. ఇంగ్లీషువాడు తుపాకి భుజాన పెట్టుకొని గోడమీద నుంచొని వున్నాడు. కాని ఖాసింఖాన్ని చూడలేదు. ఖాసింఖాన్ కళ్ళుమూసుకొని ఆ గోడని పలుగుతో ముక్కలు ముక్కలుగా బద్ధలు కొట్టాడు. గోడమీదవున్న ఇంగ్లీషువాడు గోడతోపాటు గభాలున కూల బడ్డాడు.

గోడకు మామూలుదారి ఏర్పడింది. అవతలప్రక్క మరొక పలుగు చేత్తో పట్టుకొని నిలబడి వున్నాడు శీతారామయ్య. అతనూ గోడ పగలగొట్టే ప్రయత్నంలోనే వున్నాడని గ్రహించాడు ఖాసింఖాన్.

ఇద్దరూ అప్రయత్నంగా ఒకరికొకరు కౌగలించుకొని ఆనందాశ్రు వులు రాల్చారు. కాళ్ళదగ్గర ఇంగ్లీషువాడు పడివున్నాడు. లేచే స్థితిలో లేడు. అప్పుడు వాళ్ళకి తెలిసింది....తామిద్దరూ కలిస్తే ఇంగ్లీషువాడిదేమీ లేదన్నీ, కలవనంతకాలం అంతా ఇంగ్లీషువాడిదేననీ!